క్లుప్తంగా

ప్రతి కుటుంబానికీ పని కల్పించాలి



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

రామచంద్రాపురం: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఆయన సోమవారం నెన్నూరులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు రూ.257 కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. పని ప్రదేశంలో ప్రతిరోజూ ఫొటోలు తీసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ హంసవేణి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



వ్యవసాయ క్షేత్రాల్లో ఎంపీ రాష్ట్ర నేచురల్ ఫార్మింగ్ బృందం ప్రతినిధులు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు యూనిట్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సోమవారం మధ్యప్రదేశ్ రాష్ట్ర నేచురల్ ఫార్మింగ్ బృందం ప్రతినిధులు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యమైన విత్తన గుళికలు తయారీ విధానాన్ని, 15 రకాల మిశ్రమ పంటల విధానం, బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, కషాయాల తయారీని అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేలా ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీపీఎం మునిరత్నం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్య బీమా సంస్థ పెన్షన్ పత్రాల పంపిణీ



పెన్షన్ పత్రాలు అందజేస్తున్న ఈఎస్ఐ అధికారులు

తిరుపతి తుడా: థర్డ్ ఐ మేనేజ్‌మెంట్ సంస్థ అవుట్ సోర్సింగ్ కింద ఏపీ బేవరేజెస్‌లో పని చేస్తున్న కనపర్తి స్వతంత్ర కుమార్ గత సంవత్సరం నవంబర్‌లో గుండెపోటుతో మృతిచెందారు. ఇలాంటి వారి తల్లిదండ్రులకు కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ పథకం (కార్మిక రాజ్య బీమా సంస్థ) ద్వారా పెన్షన్ పత్రాలు మంజూరు చేసింది. ఈ క్రమంలో పెన్షన్ పత్రాలను సోమవారం స్వతంత్ర కుమార్ తల్లిదండ్రులకు ఈఎస్ఐ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, థర్డ్ ఐ మేనేజ్‌మెంట్ ఎండీ తదితరులు అందజేశారు.

పొలాలపై ఏనుగుల దాడి



చిలగొండిమూల ప్రాంతంలో ఏనుగుల దాడిలో ధ్వంసమైన బీరతోట

పాకాల : దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లె సమీపంలోని చిలగొండిమూల ప్రాంతంలోని పంటలపై సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. ఇద్దరు రైతుల పంటలు దెబ్బతిన్నాయి. అలాగే మరవపల్లికి చెందిన యనమందల బాల పొలంలోని బీర తోటను, మునస్వామి నాయుడి మామిడి తోట దెబ్బతిన్నాయి. ఏనుగుల గుంపు మామిడి తోటలో ఉన్న ఏనుగుల గుంపును తరిమేందుకు రైతులు టపాసులు పేలుస్తున్నారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు రైతులు తెలిపారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

అధికారం కోసం మళ్లీ మాయమాటలు



జగనన్న ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుపతిలో భారీ ర్యాలీ

- మహానాడులో చంద్రబాబువన్నీ అబద్ధాలే
- 2014 ఎన్నికల మేనిఫెస్టోలోని 650 హామీలు ఏమయ్యాయో చెప్పాలి
- ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి
- తిరుపతిలో ఘనంగా నాలుగేళ్ల సంబరాలు



ర్యాలీ ప్రారంభోత్సవ సందర్భంగా మాట్లాడుతున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి తుడా : అధికారం కోసం చంద్రబాబునాయుడు మరోసారి మాయమాటలు చెబుతున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన టీడీపీ మహానాడులో చంద్రబాబు ప్రకటించిన పథకాలను చూసి ఆ పార్టీ నేతలే సిగ్గుతో తలవంచుకుంటున్నారని ఆరోపించారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం తిరుపతిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎం.ఎస్ సుబ్బులక్ష్మీ కూడలి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. సామవాయి మార్గం, అన్నమయ్య మార్గం మీదుగా బైక్‌ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నేను మారి పోయానంటూ మాయమాటలు చెప్పి 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని తెలిపారు. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, రైతు, డ్వాక్రా రుణమాఫీ, విద్యార్థినులకు సైకిళ్లు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అంటూ 650 హామీలను మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చాక చిత్తుకాగితంలా చెత్తబుట్టలో వేశారన్నారు. ఇప్పుడు మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. గతంలో ఇచ్చిన హామీలు ఎందుకు అమలుచేయలేదో చంద్రబాబు స్పష్టం చేయాలన్నారు. తన 14 ఏళ్ల పాలనలో పేదలను ధనికులుగా ఎందుకు మార్చలేదో చెప్పాలని నిలదీశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో ప్రజల్లోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. 89 శాతం మేర హామీలను అమలు చేసి 2.40 కోట్ల మంది ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలను అందించారని గుర్తుచేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందకూడదని కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేసిన దౌర్భాగ్యుడు చంద్రబాబన్నారు. 31 లక్షల కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. బాబు గత ఐదేళ్ల పాలనలో ఒక్క పట్టా అయినా ఇచ్చారా అని నిలదీశారు. టిడ్కో ఇళ్లను సైతం పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాయనాడుగా మహానాడు

మహానాడు మాయనాడుగా మిగిలిపోయిందన్నారు. పచ్చి అబద్ధాలు, వంచన మాటలతో మభ్యపెట్టేందుకు చేసిన ప్రయత్నం ఫలించదన్నారు. చంద్రబాబును మోస్తున్న కొన్ని వర్గాలు మాత్రమే చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, 90 శాతం మంది ప్రజలు కోరుకోవడం లేదని గుర్తించాలన్నారు. ఎన్ని హామీలు ఇచ్చినా.. ఎన్ని మాయమాటలు చెప్పినా ఇక చంద్రబాబుకు అధికారం అనేది కలగానే మిగిలిపోతుందన్నారు. ర్యాలీలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వందలాది మంది యువకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఫ్లెక్సీలు తొలగించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా : అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశించారు. ఆమె సోమవారం స్పందనలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అడ్వర్‌టైజ్‌మెంట్ బకాయిలు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనకు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పరిశుభ్రతలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిట్టన్న కందళిత సౌందర్యం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు, రచయితలు

తిరుపతి కల్చరల్: ఉపాధ్యాయుడు, కవి, రచయిత డాక్టర్ నెమిలేటి కిట్టన్న రాసిన కవితలకు ప్రతిరూపకంగా ప్రముఖ రచయిత కంపల్లె రవిచంద్రన్ రాసిన కందళిత సౌందర్యం పుస్తకాన్ని సోమవారం కరకంబాడి రోడ్డులోని ఓ ప్రయివేటు హోటల్లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని అభ్యుదయ రచయితల సంఘం, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య సంయుక్తంగా చేపట్టాయి. తెలుగు భాషోద్యమ సమితి నేత సాకం నాగరాజు మాట్లాడుతూ కిట్టన్న కవిగా, రచయితగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. అధికార భాషా సంఘం సభ్యురాలు మస్తానమ్మ మాట్లాడుతూ, చెన్నై తెలుగు భాషోద్యమ నేత గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి పరితపించారని తెలిపారు. అనంతరం కిట్టన్న షష్టిపూర్తి కార్యక్రమాన్ని ఆయన పిల్లలు నెమిలేటి మౌనిక, హారిక, ప్రసన్నకుమార్ నిర్వహించారు. యమలా సుదర్శన్, శతావధాని ఆముదాల మురళి, అరసం అధ్యక్షుడు యువశ్రీ మురళి, మన్నవ గంగాధరప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం, తమటం రామచంద్రారెడ్డి, టెంకాయల దామోదరం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం విజయనగరం ఎంపీ డి.చంద్రశేఖర్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, తమిళనాడు టూరిజం మంత్రి రామచంద్రన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు ప్రసాదాలతో సత్కరించారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులు ఉన్నాయని, ఇంటర్ పాసయిన వారు జూన్ 1వ తేదీ నుంచి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. వివరాలకు 9491520740, 9441644462లో సంప్రదించాలని సూచించారు.

ఆర్ట్ స్టూడియో పనుల పరిశీలన

తిరుపతి తుడా : తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా చేపట్టిన ఆర్ట్ స్టూడియో పనులను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత సోమవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ రూ.40 కోట్లతో ఆర్ట్ స్టూడియోను నిర్మిస్తున్నామన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో ఆడిటోరియం, డిజైనింగ్ స్టూడియో, ఫోటోగ్యాలరీ, కాన్ఫరెన్స్ హాల్, గెస్ట్ రూంలు అందుబాటులోకి వస్తాయన్నారు. పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన జూన్‌లోపు పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డీఈఈ దేవిక తదితరులు పాల్గొన్నారు.

దర్శనం.. సాధారణం

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 23 కంపార్ట్‌మెంట్లు నిండాయి. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం అవుతుండగా టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

\- తిరుమల



శ్రీవారి ఆలయం ముందున్న భక్తులు





స్వామిని దర్శనం చేసుకుని వెలుపలకు వస్తున్న భక్తులు



ఆలయ ఆవరణలో..



ఆలయ మాడ వీధిలో..





షెల్టర్‌లో సేదతీరుతున్న భక్తులు

మా జీవితాలు ప్రజాసేవకే అంకితం



వేలం దారులకు నగదును అందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- వేలం దారులకు సొంత నిధులు అందజేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- రుణపడి ఉంటామన్న రైతులు, వ్యాపారులు



సంతలో భోజనాలు వడ్డిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల : తమ కుటుంబ సభ్యులు ప్రజా సేవలో ముందుంటామని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పాకాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులు, వ్యాపారుల సంక్షేమమే ధ్యేయంగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచనల మేరకు వారపు సంత వేలం దారుడికి రూ.22,16,500, ప్రైవేట్ బస్టాండ్ వేలం దారుడికి రూ.10,06,000, జంతువధశాల వేలందారుకు రూ.52 వేలు అందజేశారు. సంతలో ఇకపై రైతులు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు ఎవరికీ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. జూన్ 6వ తేదీ నుంచి మండలంలో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు.

వారపు సంతలో రైతులకు భోజనాలు....

రైతులు, వ్యాపారులు భోజనం కోసం అవస్థలు పడకూడదన్న ఉద్దేశంతో సంతలో భోజనం పెట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. ఏ రైతు కూడా ఆకలితో అలమటించకూడదన్నారు. రాబోవు ఎన్నికల్లో మోహిత్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి రుణం తీర్చుకుంటామని రైతులు హామీ ఇచ్చారు.

భూమి పూజకు మహారాష్ట్ర సీఎంకు ఆహ్వానం



మహారాష్ట్ర సీఎంకు ఆహ్వానపత్రికను అందిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల: ముంబయిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం జూన్ 7న జరగనున్న భూమి పూజ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి సోమవారం రాత్రి మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండేకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మాణ నమూనా సీఎం ఏకనాథ్ షిండేకు చూపించి వివరించగా ఆయన కూడా బాగున్నాయని సానుకూలంగా స్పందించారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

పుత్తూరు రూరల్: పట్టణంలోని ప్రముఖ శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం అత్యంత కమనీయంగా, వైభవోపేతంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 7 గంటలకు పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కే రోజా, సెల్వమణి దంపతులు పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. అనంతరం వేద పండితులచే శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు అర్చకులు పూర్ణకుంభంతో మంత్రి దంపతులకు స్వాగతం పలికారు. కల్యాణోత్సవం అనంతరం మంత్రి దంపతులను వేద పండితులు ఆశీర్వదించి, ఆలయ మర్యాదలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, ఎంఎల్ఓ దిలీప్‌మొదలి పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ఆహ్వానం లేకపోవడం దారుణం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సమతా సైనిక్ దళ్, దళిత సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఆహ్వానించకపోవడం తగదని సమతా సైనిక్ దళ్ నేతలు చిరంజీవి, ఆమూరి సుధాకర్ విమర్శించారు. వారు సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గతంలో పార్లమెంట్ భవనం శంకుస్థాపకు అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను పిలవలేదన్నారు. నేడు భవనం ప్రారంభోత్సవానికి గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఆహ్వానించకపోవడం బీజేపీ కులవివక్షకు నిదర్శనమన్నారు. అర్హత లేని సన్యాసులతో పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా బహుజనులు మేల్కొని బీజేపీ ఆగడాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ ప్రతినిధులు రాధాకృష్ణ, పున్నాక సురేష్, చెన్నకేశవులు, కల్యాణ్, గండికోట సుబ్రమణ్యం, రాజేస్, రామ్మూర్తి, రజనీ, నిర్మల, దళిత సంఘ నేతలు ప్రసాద్‌రావు, గోపి, పవన్, వీసీకే పార్టీ నేత రమేష్, ఎస్ఎస్‌డీ నేత రాజేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సత్ఫలితాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా : సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యమని ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ ఇండియా సభ్యుడు ప్రొఫెసర్ తుప్పిల్ వెంకటేష్ తెలిపారు. స్విమ్స్‌లో సోమవారం అంతర్జాతీయ లీడ్ ఆడిటర్ సర్టిఫికెట్ ప్రోగ్రాం, ల్యాబొరేటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అవసరాలు అనే అంశంపై ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్విమ్స్‌లో అత్యున్నతా ప్రమాణాలతో కూడిన వైద్య సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. సంస్థ విజయవంతానికి అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో పనిచేస్తున్నారని కొనియాడారు. వైద్యసేవలతోపాటు టీచింగ్, పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, డాక్టర్లు కృష్ణమూర్తి, ఆనంద్, ఉషా ఆనంద్, రుక్మాంగద, అపర్ణ బిట్లా, ఎంఎం.సుచిత్ర పాల్గొన్నారు.


నిన్ను నమ్మం బాబూ



మీడియాతో మాట్లాడుతున్న నల్లానిబాబు

తిరుపతి తుడా : 'నీ మోసాల్ని, నీ మాయమాటల్ని చిన్నప్పటి నుంచీ వింటూనే ఉన్నాం.. ఇక నిన్ను నమ్మం బాబూ' అని వైఎస్ఆర్‌సీపీ ఎస్సీ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు విమర్శించారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. కులాల మధ్య చిచ్చుపెట్టడం, వర్గాల మధ్య విద్వేషాలు రగిలించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. పద్నాలుగేళ్లలో వెనుకబడిన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అణగదొక్కిన చరిత్ర బాబుదేన్నారు. మహానాడు అబద్ధాల నాడుగా, మాయా మోసాలకు వేదికగా మారిందని విమర్శించారు. ఎన్ని మాయలు చేసినా, ఎన్నిహామీలు గుప్పించినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

హోర్డింగ్స్ తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి నగరంలోని బస్టాండ్, సామవాయి రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్స్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తొలగించారు. 26వ తేదీన కురిసిన గాలీవానకు హోర్డింగ్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. దీనిపై సాక్షి దినపత్రికలో శనివారం ప్రమాదకరంగా హోర్డింగ్స్ అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు హోర్డింగ్స్ తొలగించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి